




దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 183 మంగళవారం 08-07-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..


# క్రీడా వర్సిటీకి సహకరించండి

## ఖేలో ఇండియా గేమ్స్‌ను తెలంగాణలో నిర్వహించండి.. క్రీడా వసతులకు 100 కోట్లు ఇవ్వండి

- ఒలింపిక్స్-2036లో 2 ఈవెంట్లు రాష్ట్రంలో జరపండి
- క్రీడాకారులకు రైల్ చార్జీల్లో రాయితీ పునరుద్ధరించండి
- కేంద్ర మంత్రి మాండవీయకు సీఎం రేవంత్‌రెడ్డి వినతి
- సీఎం రేవంత్‌తో కపిల్ దేవ్, అజయ్ దేవ్‌గణ్ భేటీ
- తెలంగాణలో క్రీడారంగం అభివృద్ధిపై కపిల్ ప్రశంస
- రాష్ట్రంలో ఫిల్మ్ స్టూడియో నిర్మిస్తానన్న అజయ్ దేవ్‌గణ్



**న్యూఢిల్లీ, జూలై 7:**
తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు సహకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి.. కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయకు విజ్ఞప్తి చేశారు. వచ్చే ఏడాది జరగనున్న ఖేలో ఇండియా గేమ్స్‌ను తెలంగాణలో నిర్వహించాలని, దాంతోపాటు జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు ఆతిథ్యమిచ్చే అవకాశం తెలంగాణకు కల్పించాలని కోరారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని ఆయన అధికారిక నివాసంలో రేవంత్ కలిశారు. ఖేలో ఇండియా కింద క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, క్రీడాకారుల శిక్షణ, క్రీడా నిపుణుల ఎంపిక, ఇతర కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని కోరారు. భువనగిరిలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, రాయగిరిలో స్విమ్మింగ్ పూల్, మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీలో, నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌ల నిర్మాణాలు, కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో మల్టీపర్పస్ హాల్, హైదరాబాద్ హకీంపేట్‌లో అర్చరీ రేంజ్, సింథటిక్ హాకీ ఫీల్ ఎల్‌బీ స్టేడియంలో స్క్వాష్ కోర్టు, నేచురల్ ఫుట్‌బాల్ ఫీల్డ్ అభివృద్ధి, సింథటిక్ ట్రాక్, గచ్చిబౌలిలో హాకీ గ్రౌండ్ నవీకరణకు రూ.100 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. క్రీడా వసతులను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అన్నివిధాలా కృషి చేస్తోందని, కేంద్రం సైతం తమ వంతు సహకారం అందించాలని కోరారు. 2036లో దేశంలో నిర్వహించే ఒలింపిక్స్‌లో కనీసం రెండు ఈవెంట్లను తెలంగాణలో నిర్వహించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు గతంలో మాదిరే రైల్వే టికెట్లలో రాయితీ ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఏపీ జితేందర్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కేంద్ర పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

**క్రీడారంగం అభివృద్ధిపై కపిల్‌దేవ్ ప్రశంస..**
తెలంగాణలో క్రీడారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ ప్రశంసించారు. సోమవారం ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కపిల్ దేవ్ కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు, క్రీడాభివృద్ధికి తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కపిల్‌దేవ్‌కు సీఎం రేవంత్ వివరించారు. దీంతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతోపాటు తెలంగాణలో క్రీడాభివృద్ధికి సంబంధించిన అన్ని విషయాల్లోనూ తాను భాగస్వామినవుతానని కపిల్‌దేవ్ అన్నారు.

# భట్టితో ప్రైవేటు కాలేజీ యాజమాన్యాల భేటీ

- ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపు ప్రత్యామ్నాయాలపై చర్చ..
- కొత్తగా ఎస్బీఐ ఎడ్యుకేషన్ ఎపెక్స్ బ్యాంక్ ఏర్పాటుకు ప్రతిపాదన



**హైదరాబాద్, జూలై 7 :**
గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై సర్కారు ముందు ప్రైవేటు కాలేజీల యాజమా న్యాలు కొత్త ప్రతిపాదన ఉంచాయి. ప్రతి ఏటా దాదాపు రూ.2,500 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్న నేపథ్యంలో.. కొత్తగా ఎస్బీఐ ఎడ్యుకేషన్ ఎపెక్స్ బ్యాంక్ ఏర్పాటు చేసి, దీని ద్వారా ఉన్నత విద్యాసంస్థల ఆర్థిక లావాదేవీలన్నీ నిర్వహించాలని కాలే జీ యాజమాన్యాల ప్రతినిధులు కోరారు. సోమవారం డిప్యూటీ సీఎం, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్కతో జరిగిన సమావేశంలో తె లంగాణ ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సంఘాల సమాఖ్య అధ్యక్షుడుఎన్. రమేశ్ బాబు మాట్లాడుతూఆబ్యాంకు నిధుల వడ్డీల తోనే చెల్లించవచ్చన్నారు. తమ ప్రతిపా దనపై డిప్యూటీ సీఎం సాను కూలం గా స్పందించారని, సీఎస్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారని ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు తెలిపాయి.

# రేపు భారత్ బంద్



**న్యూఢిల్లీ, జూలై 7:**
కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ 10 కార్మిక సంఘాల వేదిక బుధవారం భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. మోదీ సర్కారు అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక, దేశ వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ ఈ బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఓ ప్రకటనలో తెలిపింది. ఈ దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని కోరింది. దేశవ్యాప్తంగా జరగనున్న ఈ సమ్మెలో బ్యాంకింగ్, బీమా, తపాలా, బొగ్గు గనులు, జాతీయ రహదారులు, నిర్మాణ రంగాలకు చెందిన 25 కోట్ల మందికి పైగా పాల్గొంటారని పేర్కొంది. దేశవ్యాప్తంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల్లోకి కార్మికులు కూడా సమ్మెలో పాల్గొంటారని ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెసకు చెందిన అమర్జీత్ తెలిపారు.

# బ్రిక్స్‌కు మద్దతిస్తే 10% అదనపు సుంకం

## దానివి అమెరికాకు వ్యతిరేక విధానాలు.. ప్రపంచ దేశాలకు ట్రంప్ హెచ్చరిక




**వాషింగ్టన్/రియో డీ జనేరో:** ఒక పక్క బ్రిక్స్ దేశాల సదస్సు బ్రెజిల్‌లో జరుగుతుంటే మరోపక్క అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ వాణిజ్య కూటమి పట్ల విషం కక్కారు. బ్రిక్స్ అనుసరిస్తున్న అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతుగా నిలిచిన దేశాలపై మరో పదిశాతం అదనపు సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. ఇందులో ఎలాంటి మినహాయింపు ఉండబోదని స్పష్టం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. బ్రిక్స్ అనుసరిస్తున్న అమెరికా వ్యతిరేక విధానాలేంటో చెప్పలేదు. ప్రపంచ దేశాలకు వాణిజ్య విధివిధానాలు అధికారికంగా లేఖల రూపంలో పంపిస్తున్నట్లు తెలిపారు. 2009లో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలతో ఏర్పడి, తర్వాత దక్షిణాఫ్రికాను కలుపుకొని, ఇప్పుడు ఈజిప్టు, ఇథియోపియా, ఇండోనేసియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈలకు విస్తరించిన వాణిజ్య కూటమి బ్రిక్స్. ట్రంప్ అడ్డగోలు సుంకాలను పరోక్షంగా తప్పుబడుతూ బ్రిక్స్ ప్రకటన చేయగానే ట్రంప్ తాజా ప్రకటనతో బదులిచ్చారు. బ్రిక్స్ ప్రకటనలో ప్రపంచ వాణిజ్య సంస్థ మద్దతు కలిగిన నిబంధనలతో కూడుకున్న, పారదర్శకమైన, అందరినీ కలుపుకొనిపోయే, సమానత్వంతో కూడిన బహుళ వాణిజ్య వ్యవస్థకు మద్దతు తెలుపుతామని చెప్పింది. ట్రంప్ ప్రకటించిన భారీ సుంకాల అమలుకు 90 రోజుల గడువు ఇచ్చిన సంగతి తెలిసిందే. అది బుధవారంతో ముగిసిపోతోంది. ఆలోపు భారత్ అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోవాలి. అందుకు సంబంధించిన చర్చలు ముగిశాయి. ట్రంప్ తాజా ప్రకటన ఇరు దేశాల మధ్య కుదరనున్న వాణిజ్య ఒప్పందం మీద ఎలాంటి ప్రభావం చూపబోదని అధికారులు అంటున్నారు. ట్రంప్ ప్రకటన మీద చైనా స్పందించింది. మూడో దేశాన్ని లక్ష్యంగా చేసుకొని బ్రిక్స్ పని చేయదని స్పష్టం చేసింది. వాణిజ్యంలో విజేతలు ఉండరని, రక్షణాత్మక వాణిజ్యం ముందుకు తీసుకెళ్లదని వ్యాఖ్యానించింది. బ్రిక్స్ సభ్య దేశాలు కశ్మీరులోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండించాయి. ఉగ్రవాదంపై పోరులో ఎలాంటి రాజీ ఉండరాదని పిలుపునిచ్చాయి. ఉగ్రవాదంపై కొన్ని దేశాల ద్వంద్వ ప్రమాణాలను తప్పుబట్టాయి. ఉగ్రవాదులకు నిధులు అందకుండా చూడాల్సిన అవసరాన్ని గుర్తు చేశాయి. మరోపక్క ప్రధాని మోదీ నిరుపేద దేశాల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా బ్రిక్స్ దేశాలు పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ క్యూబా అధ్యక్షుడు మైగల్ డియాజ్ కెనాల్ బెర్ముడెజ్‌తో సమావేశం అయ్యారు. ఫార్మా, యూపీఐ అమలు వంటి అంశాలపై చర్చించారు. మలేసియా ప్రధాని, బొలీవియా, ఉరుగ్వే అధ్యక్షులతోనూ భేటీ అయ్యారు.

# గణపతిని చుట్టుముట్టిన బలగాలు?

- పీఎల్‌జీ కమాండర్ హిడ్మా కూడా అక్కడే?? - బలగాలను వెంటనే వెనక్కి రప్పించాలి
- తెలంగాణ పౌరహక్కుల సంఘం డిమాండ్



**చర్ల, జూలై 7:** బీజాపూర్ దండకారణ్యంలోని నేషనల్ పార్క్‌పై పోలీసు బలగాలు పట్టు సాధించాయా? వచ్చే ఏడాది మార్చికల్లా నక్సలిజాన్ని అంతం చేస్తామని ప్రతినబూనిన కేంద్ర ప్రభుత్వం.. నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో 25 వేల బలగాలను మోహరించిందా? మావోయిస్టు పార్టీ అగ్రనేత గణపతితోపాటు.. గెరిల్లా తంత్రాల్లో ఆరితేరిన పీఎల్‌జీ ఒకటో బెటాలియన్ కమాండర్ మాడ్వీ హిడ్మా, మరో అగ్రనేత దేవాను బలగాలు చుట్టుముట్టాయా? ఈ ప్రశ్నలకు అటు ఛత్తీసగఢ్ పోలీసుల హెచ్చరికలు.. ఇటు పౌర హక్కుల నేతల ఆందోళనలు పరోక్షంగా ఔననే సమాధానం చెబుతున్నాయి. నిజానికి కేంద్ర బలగాలు ఈ ఏడాది మార్చి నుంచే తెలంగాణ-ఛత్తీసగఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో భారీ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో.. ఇక్కడి కేంద్ర బలగాలను సరిహద్దులకు తరలించారు. ఆ తర్వాత డీఆర్జీ బలగాలు మాత్రమే కూంబింగ్ కొనసాగించాయి. గత నెల నేషనల్ పార్క్‌లో అతిపెద్ద ఆపరేషన్‌ను నిర్వహించి, కేంద్ర బలగాల సహకారం లేకుండానే 17 మంది మావోయిస్టులను హతమార్చాయి. అయితే.. భారత్-పాకిస్థాన్ సరిహద్దులకు వెళ్లిన బలగాలు అంతేవేగంగా ఛత్తీసగఢ్‌కు తిరిగి రావడం సాధ్యమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పౌరహక్కుల సంఘాల నేతలు మాత్రం 25 వేల కేంద్ర బలగాలతో నేషనల్ పార్క్‌ను చుట్టుముట్టారని ఆరోపిస్తున్నారు.

**ఆపరేషన్‌ను ఆపాలి: గడ్డం లక్ష్మణ్**
నేషనల్‌పార్క్ ఆపరేషన్‌ను వెంటనే ఆపేయాలని తెలంగాణ రాష్ట్ర పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణరావు డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీ అగ్రనేతలను బలగాలు చుట్టుముట్టాయనే సమాచారం అందుతోందన్నారు. హిడ్మా, దేవాను లక్ష్యంగా చేసుకుని, అడవిని చుట్టుముట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. నేషనల్ పార్క్‌ను పోలీసులు చుట్టుముట్టారని, అక్కడ గణపతి, హిడ్మా వంటి అగ్రనేతలు ఉన్నట్లు ప్రచారం చేస్తున్నారని ప్రొఫెసర్ హరగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ మావోయిస్టులను లొంగిపోవాలని, లేదంటే చావుకు సిద్ధం కావాలని హెచ్చరించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఇప్పటికైనా కాల్పుల విరమణ ప్రకటించాలని కోరారు.

# అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

## తెలుగు కుటుంబం సజీవ దహనం



**హైదరాబాద్ సిటీ, జూలై 7:**
అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో.. నగరానికి చెందిన ఓ నిండు కుటుంబం సజీవ దహనం అయింది. నగరంలోని కొంపల్లి ప్రాంతానికి శ్రీవెంకట్ బెజుగం, తేజస్విని దంపతులు, వారి ఇద్దరు పిల్లలు సిద్ధార్థ్ బెజుగం, మ్రిదా బెజుగం దుర్మరణంపాలయ్యారు. శ్రీవెంకట్, తేజస్విని ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే. వీరు మూడేళ్ల క్రితం అమెరికాకు వెళ్లి, డాల్‌సలో ఇల్లు కొనుక్కొని అక్కడే స్థిరపడ్డారు. ఇటీవలే శ్రీవెంకట్.. అట్లాంటాలోని తన అక్క ఇంటికి భార్య, పిల్లలతో సహా వెళ్లారు. వారంరోజులపాటు అక్కడే ఆనందంగా గడిపి తిరిగి వస్తుండగా.. ఆదివారం అర్ధరాత్రి గ్రీన్ కౌంటీ ఏరియాలో.. రాంగ్ రూట్‌లో వచ్చిన మినీ ట్రక్ వారి కారును ఢీ కొట్టింది. ట్రక్ వేగంగా ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. వెంకట్ కుటుంబం ప్రయాణిస్తున్న కారు మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఆ నలుగురి శరీరాలూ పూర్తిగా కాలిపోవడంతో అధికారులు వారి ఎముకలను సేకరించి.. డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ ద్వారా గుర్తించే ప్రయత్నంలో ఉన్నారు. ట్రక్ డ్రైవర్ తప్పిదమే ఈ ప్రమాదానికి కారణమని స్థానిక పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. కాగా.. వెంకట్ కుటుంబం మృతితో హైదరాబాద్‌లోని వారి కుటుంబ సభ్యులు, బంధువులు శోక సముద్రంలో మునిగిపో యారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన శ్రీవెంకట్ తల్లిదండ్రులు పశుపతినాథ్, గిరిజ నగరంలోని తిరుమలగిరి టీచర్స్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. ఏడాది క్రితం వారు డాల్‌సలోని తమ కుమారుడి వద్దకు వెళ్లారు. అప్పట్నుంచీ అక్కడే ఉన్నారు.

# సమర శీల పోరాట యోధుడు కామ్రేడ్ లింగంపల్లి బిక్షపతి



జీవితాంతం ఎర్ర జెండా పోరులో వెలుగై ప్రకాశించిన సమర శీల పోరాట యోధుడు కామ్రేడ్ డాక్టర్ లింగంపల్లి బిక్షపతి. ఆయన పోరాట జీవితం నేటి తరానికి స్ఫూర్తి దాయకం. మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలం, ఎల్లంపేట గ్రామంలో 1942లో లింగంపల్లి బిక్షపతి జన్మించారు. ఆయన బాల్యంలో నాలుగో తరగతి వరకు చదివినప్పటికీ నాలుగు పదుల వయసులో ఎస్.ఎస్. సి. పరీక్షకు హాజరయ్యారు. రేపిడెక్స్ ఇంగ్లీష్ కోర్స్ ను తనకు తాను స్వయంగా అభ్యసించి తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలపై పట్టు సాధించారు. 34 సంవత్సరాల వయసు వరకు ఆధ్యాత్మిక భావజాలంలో కొనసాగుతూ పౌరాణిక నాటకాలు, కోలాటాలు, జడ కొప్పులు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రజలను రంజింపజేశారు. మంగలి కులంలో పుట్టి క్షౌర వత్తి, ఆయుర్వేద వైద్యం, సంగీతంతో పాటు అభ్యుదయ పద్య గీతాలు రాయడం, పాడడం చేశారు. హార్మోనియం, తబలా, డోలక్ వంటి సంగీత పరికరాలు వాయించడమే కాక ఇతరులకు వాటిని నేర్పించడంలో కూడా దిట్ట. ఎల్లంపేట దొరల, భూస్వాముల దోపిడీ, పెత్తందారి దళారీల, పీడన, ఎట్టి చాకిరి చూసి చలించిపోయి తిరుగుబాటుకు దారులు వెతకడం ప్రారంభించారు. ఆ ప్రయత్నంలో భాగంగా ఎర్ర జెండాకు ఆకర్షితులై తన 34వ, ఏటా 1976లో సిపిఎం పార్టీలో క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నారు. పుచ్చలపల్లి సుందరయ్య, భీమ్ రెడ్డి నరసింహారెడ్డి, ఓంకార్ మార్గ దర్శకత్వంలో ఎల్లంపేట పరిసర ప్రాంతాలలో కమ్యూనిస్టు (మార్క్సిస్ట్) పార్టీ నిర్మాణానికి పూనుకున్నారు. జి. నాగయ్య, జి రాములు, బివి రాఘవులు, గోవర్ధన్ రెడ్డి, మౌలానా తదితర సహచర మిత్రులతో కలసి పనిచేస్తూ ఉద్యమ వ్యాప్తికి కృషి చేశారు. ప్రస్తుతం ఆయన తయారుచేసిన కార్యకర్త మహబూబాబాద్ జిల్లా సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులుగా అల్వాల వీరయ్య ఉన్నారు. భూస్వాముల, దొరల గడీలకు వ్యతిరేకంగా 50 మంది సభ్యులతో గుత్పల సంఘాన్ని ఏర్పాటు చేసి తిరుగుబాటు జెండా ఎగుర వేశారు. ఎట్టి చాకిరికి వ్యతిరేకంగా అనేక రకాల ప్రజా పోరాటాలు నిర్వహించారు. “భూస్వామి వీధి బాగోతం”, “పంజరంలో చిలుక” “మాయ” వంటి తదితర నాటకాలకు తన దర్శకత్వంలో శిష్యుల ద్వారా ప్రదర్శనలను ఇస్తూ ప్రజలను చైతన్యం చేశారు. వివిధ సభలలో లెనిన్ వేషధారణ ప్రదర్శిస్తూ ప్రజలను ఉద్యమం వైపు ఆకర్షించారు. అనేక కూలి పోరాటాలు నిర్వహించారు . వ్యూహాత్మకంగా తన పోరాటానికి పదును పెడుతూ దొరల భూస్వాములను హడల్ ఎత్తించారు. ఈ పోరాటంలో ఎన్ని అవాంతరాలు కల్పించిన బిక్షపతి తన పోరాటాన్ని ఆపలేదు. డాక్టర్ బిక్షపతి పై ఆయన అనుచరులపై మొత్తం 21 కేసులు నమోదు కాగా, వరంగల్ సెంట్రల్ జైల్లో మూడు దఫాలుగా జైలు జీవితం గడిపారు. ఒక సంవత్సరం పాటు అజ్ఞాతంలో ఉంటూ తన పోరాటాన్ని కొనసాగించారు. చదువుల ద్వారానే సామాజిక మార్పు సిద్ధిస్తుందని భావించి ఎల్లంపేటలో నేతాజీ ప్రజా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి కార్యదర్శిగా కొనసాగారు. తన పోరాటాలు విజయవంతంగా ముందుకు నడపడం కోసం రాత్రి బడి నిర్వహిస్తూ తోటి కామ్రేడ్ కుటుంబాలకు విద్యాతో పాటు పాటలు నేర్పించారు. ఎల్లంపేట హై స్కూల్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. మద్యపానం, ధూమపానం వంటి సాంఘిక దురాచారాలను మాన్పించుటకు ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ఆయుర్వేద వైద్య వృత్తితో అనేక మంది ప్రాణాలను కాపాడుతూ మంచి డాక్టర్ గా కీర్తి గడించారు. తను జన్మించిన మంగళి సామాజిక వర్గ కుటుంబాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన నోపా గౌరవ సలహాదారులుగా పనిచేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక మార్పు కోసం నిరంతరం పనిచేస్తూ, పరితపిస్తూ వృద్ధాప్యంతో తన 82వ ఏటా 29.06.2025న మరణించారు. 1976లో ఎత్తిన ఎర్రజెండాను మరణించెంత వరకు దించలేదు. సమాజ మార్పు కోసం నిరంతరం పోరాటాలు చేస్తూనే తన కొడుకు లింగంపల్లి దయానంద్ ను ఉన్నత చదువులు చదివించి ప్రజాతంత్ర ఉద్యమాల వైపుగా నడిపించారు. లింగంపల్లి దయానంద్ జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్ గా ఉన్నారు. పుట్టుక నీది చావు నీది బతుకంతా దేశానిది అన్న కాళోజీ మాటలను నిజం చేస్తూ వైద్య వృత్తిపై గల మక్కువతో వైద్య విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి చెంది మానవాళికి ఉపయోగపడాలన్న కాంక్షతో తన భౌతికకాయాన్ని మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి డొనేట్ చేయాలని తనకు తాను తీర్మానించుకున్నారు. ఆయన కోరిక మేరకు ఆయన పార్థివ దేహాన్ని మహబూబాబాద్ మెడికల్ కాలేజీ వారు స్వాధీనం చేసుకొని వైద్య విద్యార్థుల పరిశోధన పరీక్షల నిమిత్తం భద్రపరిచారు. బిక్షపతికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. భర్త చేస్తున్న ప్రజా పోరాటాలకు చేయుతనిస్తూ సహ దర్మచారినిగా బిక్షపతి భార్య కమలమ్మ ప్రజల మన్ననలను అందుకుంటున్నారు. మనువాదం నుండి మానవతా వాదానికి, భౌతిక వాదమైన కమ్యూనిజం వైపు తను మారడమే గాక తన తోటి సమాజాన్ని మార్చడం కోసం జీవితాంతం ఆచరణాత్మక పోరాటాన్ని కొనసాగించిన సమరశీల పోరాట యోధుడు కామ్రేడ్ డాక్టర్ లింగంపల్లి బిక్షపతి పోరాట స్ఫూర్తిని ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనం అర్పించే ఘన నివాళి.(09.07.2025న ఎల్లంపేట గ్రామంలో కామ్రేడ్ డాక్టర్ లింగంపల్లి బిక్షపతి సంస్మరణ సభ సందర్భంగా కామ్రేడ్ డాక్టర్ లింగంపల్లి బిక్షపతి యాదిలో)

## బంజారా ప్రముఖులను ఘనంగా సన్మానించిన

## బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ గిరిజన సంఘాల నాయకులు

**తొలి సమయం హనుమకొండ జిల్లా జులై 7:** హన్మకొండ హనుమాన్ డబ్బాల దగ్గర ఆఫీస్ లో వరంగల్ సిటీ లో ఉంటున్న పదోన్నతులు పొందిన, పదవి విరమణ పొందిన బంజారా ప్రముకులు గవర్నమెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియమికమైన భూక్య వెంకట్రామ్ నాయక్ ని మరియు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నుండి అడిషనల్ డైరెక్టర్ గా ప్రమోషన్ పొందిన దరవత్ శరత్ నాయక్ ను, %ఐచీ+ూా% రాష్ట్ర ఉపాధ్యక్షుడు గా ఎన్నికైన బి.రాము నాయక్ ను %ఐచీ+ూ% రాష్ట్ర ఈసీ నెంబర్ గా ఎన్నికైన లాల్ నాయక్ ను మరియు ఫోర్త్ క్లాస్ ఎంప్లాయ్ రాష్ట్ర అధ్యక్షులు గా ఎన్నికైన లునవత్ దాస్య నాయక్ ను మరియుకోర్ర ధరమ్ సింగ్, గ్రేటర్ మున్సిపాలిటీ శానిటరీ ఇన్స్పెక్టర్ గా రిటైర్డ్ అయినందున మరియుబి. హరిలాల్, జిసిసి మేనేజర్ గా రిటైర్డ్ అయినందున మరియుడి. జగ్రామ్, జిసిసి సేల్స్ మెన్ గా రిటైర్డ్ అయినందున బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ మరియు గిరిజన సంఘాల ఆధ్వర్యంలో వి ఎన్ నాయక్ అధ్యక్షతన ఘనంగాసన్మానించారు. ముఖ్య అతిథులుగా ఆర్డిఓ డి.ఎస్ వెంకన్న నాయక్, ఎ .సి.పి నందిరాం నాయక్, బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పోరిక జవహర్ లాల్ నాయక్, జై సింగ్ రాథోడ్, వాంకుడోత్ వీరన్న నాయక్,బానోత్ జవహర్ లాల్ నాయక్ ,రామ్ చందర్ నాయక్ ,తేజావత్ జవహర్ లాల్, కేయూ ప్రొఫెసర్ పోరిక రమేష్ నాయక్ ,ఎస్సీ ఎస్టీ అట్లా సిటీ మెంబర్ ఎన్ .జవహర్ లాల్ ,పాడియా గాంగు



నాయక్,అడ్వకేట్ పోరిక సమ్మయ్య నాయక్, పోరిక ఉత్తంకుమార్ నాయక్, అడ్వకేట్ రాజు నాయక్, అడ్వకేట్ లావుడియా గోవర్ధన్, ఎస్టిఎసి అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్టీసీ డిపార్ట్మెంట్ ఏం. రమేష్ నాయక్ లావుడియారాజు నాయక్ జర్నలిస్ట్ తదితరులు పాల్గొన్నారు

## రానున్న స్థానిక ఎన్నికలకు దృష్టిలో ఉంచుకొని పార్టీ క్యాడర్ పనిచేయాలి

### పట్టణ అధ్యక్షులు దిలీప్ రెడ్డి



**తొలి సమయం పెబ్బేర్** పెబ్బేరు మండల కేంద్రంలో ని రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మాత్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ పెబ్బేరు పట్టణ అధ్యక్షులు వి దిలీప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో1 వ వార్డులోని కర్రెమ్మ గుడి దగ్గర టెంకాయ కొట్టి బిఆర్ఎస్ నాయకులు ప్రచారం ప్రారంభించారు, ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు అమలుపర చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతపట్టణం ప్రతి వార్డులలో ఏ ఒక్క అభివృద్ధి జరగలేదని గత బిఆర్ఎస్ ప్రభుత్వం అమలుపరచిన నిధులను వార్డులలో సీసీ రోడ్లు వేయుచున్నారని, ఎన్నికల ముందు ఇందిరమ్మ ఇండ్లు బోగస్అనీ అర్హులకు ఇవ్వకుండా అనర్హులకే కేటాయించారని, వృద్ధులకు 4000 పెన్షన్ వికలాంగులకు 6000 పెన్షన్ నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, దళితులకు దళిత బంధు పథకం, నిరుద్యోగులకు సంవత్సరానికి ?2 లక్షల ఉద్యోగాలు, ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి పథకానికి 1,50000=00, తులం బంగారం ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి మాయమైపోయిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని కాంగ్రెస్ ప్రభుత్వ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని, ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమం లో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణ శ్రీ సాయినాథ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేకల కర్ర స్వామి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు చిన్న ఎల్లారెడ్డి, శేఖర్ గౌడ్, వేణు, సోప్పరి బీచ్ పల్లి, సంతోష్, వి సాయి రెడ్డి, యాదగిరి గౌడ్, మన్యం,గోనెల సహదేవుడు, గంధం వెంకటయ్య, సంతోష్ శ్రీనివాస్ రెడ్డి,సంబురాము, వసంత్ గోవర్ధన్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు రాములు, శేఖర్ ఆచారి, రాములు,ఎర్రం సిద్దు,రమేష్, శేఖరయ్యా, నాగన్న,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**బచ్చన్నపేట జూలై 7 తొలి సమయం న్యూస్**

బచ్చన్నపేట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు, స్థానిక దుర్గమ్మ మాత గుడి నుండి బచ్చన్నపేట చౌరస్తాఎమ్మార్పీఎస్ గద్దె వరకు రాలిగా వెళ్లారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్చార్జి బోడ సునీల్ మాదిగ పాల్గొని జండా ఆవిష్కరణ చేసి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 60 సంవత్సరాల పుట్టినరోజు వేడుకలను కేక్ కటింగ్ చేసి ప్రజలకు పండ్లు స్వీట్స్ పంపిణీ చేసి ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమలో, పాకాల కుమారస్వామి మాదిగ, సీనియర్ నాయకులు ఆల్వాల నరసింగరావు మాదిగ, నల్ల అంజయ్య, జిల్లా కార్యదర్శి అల్వాల రాజు, మాజీ మండల అధ్యక్షులు గిద్దల రమేష్, మాజీ మండల అధ్యక్షులు అలవాల అనిల్ కుమార్, బచ్చన్నపేట టౌన్ అధ్యక్షులు ఆల్వాల విజయ్ కుమార్ మాదిగ, జిల్లా సీనియర్ నాయకులు తుడుం రాజు కుమార్, బేడ బుడగల మండల అధ్యక్షులు సిరిపాటి రామదాస్, గంధ మల్ల ఇస్తారి, అల్వాల ఉదయ్, అల్వాల నిఖిల్, వాళ్ల దినేష్,మొద్దు భాస్కర్, బొట్ల గణపతి అలింపుర్ అధ్యక్షులు కొమ్ము శ్రీకాంత్ మాదిగ, పాకాల నరసింహులు, శ్రీను, పొచ్చన్నపేట బొంకురి శివాజీ,కొడువాటూర్ బంధరపు నరేష్, రాంచంద్రగూడెం బింగి రవి, కేసిరెడ్డిపల్లి గ్రామ అధ్యక్షులు తుడుం సందీప్, బొడ్డు నవీన్, చిలకమ్మా, మల్లమ్మ, గుడ్ల లక్ష్మి, పోచమ్మ, సిద్దయ్య, నరసయ్య, మరియు గ్రామ యువత తదితరులు పాలొగొన్నారు.

## అనుమానస్పద మృతి కేసులో విచారణను వేగవంతం

### పెద్ద వంగర ఎస్సై క్రాంతి కిరణ్

**తొలి సమయం పెద్ద వంగర జూన్ 7**




03-07-2025 రోజున ఆత్మహత్యకు పాల్పడిన పెద్ద వంగర మండలం అవుతాపురం గ్రామంలో జరిగిన మృతురాలు వేముల ఝాన్సీ అనుమానస్పద మృతి కేసులో విచారణను వేగవంతంగా పూర్తి చేసి సరియైన సాక్షాదారాలను సేకరించి అనుమానితులుగా ఉన్న ఇద్దరు వ్యక్తులు అయినా చిధిరాల రాజు తండ్రి రవీందర్, గ్రామం తొర్రుర్ మరియు సలిదండి ప్రవీణ్ తండ్రి సోమ నరసయ్య, గ్రామం అవుతాపురం గ్రామం లను ఈరోజు అరెస్టు చేసి జైలుకు తరలించడం జరిగింది...

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**దంతాలపల్లి తొలి సమయం జులై 07 2025**

:దంతాలపల్లి మండల %వీ=ూా% కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా %వీ=ూా% ఆవిర్భావ31 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు దంతాలపల్లి మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షుడు సోమార్పు లింగయ్య మాదిగ మరియు ఇమ్మడి వెంకటేశ్వర్లు మాదిగ మండల ఇన్చార్జి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా మరియు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి జన్మదిన వేడుకలను జెండా ఆవిష్కరణతో పాటు కేక్ కటింగ్ చేసి,పలువురు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, అదే విధంగా రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు ,కార్యకర్తలు సమక్షంలో జరుపుకొన్నారు

## జయంతికి డాక్టరేట్ ప్రధాన ఉత్సవం




**తొలి సమయం, ఇల్లందు.జూలై, 07.** కాకతీయ విశ్వవిద్యాలయం వరంగల్లో 23వ స్నాతకోత్సవ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఇల్లందు పట్టణానికి చెందిన 14 నెంబర్ బస్తీకి చెందిన లఖన్ లాల్- జయశ్రీ లోదు గారి కుమార్తె అయినా జయంతి కి హిందీ సబ్జెక్టులో డాక్టరేట్ను గవర్నర్ గారి చేతుల మీదుగా ఈరోజు స్వీకరించటం జరిగింది దీనికి పలువురు పట్టణ ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

తొలి సమయం
మంగళవారం, జూలై 8 2025

# మానవతావాదులుగా జీవించడం అవసరం

## పదవీ విరమణ సభలో జస్టిస్ రాధారాణి



**తొలి సమయం, హన్మకొండ జులై 7:**
మానవులు జన్మతః తర్క జీవులని తర్క జ్ఞానం నుండే హేతువాదం పుడుతుందని మానవులు మానవతవాదులుగా, ప్రగతిశీలవాదులుగా జీవించడం చాలా సాధారణ విషయంగా చూడాలని, ప్రగతిశీల భావాలతో మానవాతవాదులుగా జీవిస్తే ఇన్ని నేరాలు, ఘోరాలు, దోపిడీ జరగదని డాక్టర్ జస్టిస్ గురజాల రాధారాణి అన్నారు. తెలంగాణ హై కోర్టు జడ్జిగా పదవీ విరమణ చేసిన జస్టిస్ రాధారాణికి కులనిర్మూలన సంఘం, మానవ వికాస వేదిక, ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్, విజ్ఞాన దర్శిని, జన విజ్ఞాన వేదిక నాయకులు సంయుక్తంగా ఆదివారం రాత్రి హైదరాబాద్ లోని బషీరాబాగ్ ప్రెస్ క్లబ్ లో కుల నిర్మూలన సంఘం నాయకులు వహీద్ అధ్యక్షతన జరిగిన జస్టిస్ రాధారాణి పదవీ విరమణ అభినందన సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. కులాంతర వివాహాలు గొప్పవని అనుకోవడం సరికాదని, జీవితంలో అది సాధారణ విషయంగా సభ్య సమాజం చూసినప్పుడే కుల రహిత సమాజం నిర్మితమై అసమానతలు లేని సమాజం నిర్మితమవుతుందని అన్నారు. మగాధిపత్య సమాజం తన భావాలు, నిర్ణయాలు చెప్పకనే మహిళల మీద రుద్ద పడుతుంటాయని, న్యాయ వ్యవస్థ కూడా మగాధిపత్య సమాజానికి అతీతం కాదని అన్నారు. బంధువులు, స్నేహితులు లేకుండా మగాధిపత్య న్యాయ వ్యవస్థలో నిర్ణయాలలో మహిళలు రాణించడం చాలా కష్టమని అలాంటి వ్యవస్థలో కృత నిచ్చయంతో నా వంతు నిర్ణయాలను, అభిప్రాయాలను నిక్కచ్చిగా వెలుబుచ్చి న్యాయ వ్యవస్థలో తన స్థానాన్ని నిలబెట్టుకొని నిజాయితీగా పదవీ విరమణ చేశానని అన్నారు. పెళ్ళికి అక్కరకు రాని సాంప్రదాయాలు అవసరం లేదని, ఎలాంటి ఆర్భాటాలు, అక్కరకు రాని సాంప్రదాయాలు లేకుండా నిడారంబరంగా మా పెళ్ళి చేసుకొని అంతే సామాన్యంగా జీవించామని, మా పూర్వీకుల నుండి అలవర్చుకున్న హేతుబద్ధత, ప్రగతిశీలత మేము పాటించామని, మా పిల్లలు కూడా అంతే హేతుబద్ధతతో, కులనిర్మూలన కోసం తమవంతు ఆచరణాత్మక జీవితాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. జీవితంలో దేవుడి అవసరం లేదనీ, కుటుంబంలో అన్యోన్యంగా, సమాజం పట్ల బాధ్యతగా బతకడం, ఉద్యోగ నిబద్ధత అవసరమని అన్నారు. జడ్జిలు వారిచ్చే తీర్పుల ద్వారా మాత్రమే మాట్లాడాలని, మన ఆలోచన, సామాజిక చైతన్యం, ఆచరణను బట్టే జడ్జిమెట్లు వస్తాయని అన్నారు. ఆలోచన ఆచరణ ఒకటిగా ఉండాలని, ఎన్నో అసమానతలు, వివక్ష కొనసాగుతున్న సమాజంలో సాధారణ జీవితం గొప్పదని, తనకు అభినందన సభ ఏర్పాటు చేసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ హై కోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ టి రజనీ మాట్లాడుతూ మహిళ గర్భానికి బానిసని, ప్రతి మనిషిలో ఒక భిన్నమైన ఆలోచన విధానం, సిద్ధాంతం నిగూఢంగా ఉంటుందని, మహిళలను భర్త కొడితే అది హింస కాదనే భావంతో 80 శాతం న్యాయమూర్తులు ఉంటారని అన్నారు. అది వారి జీవితం, అనుభవం, ఆలోచన నుండి వస్తుందని అన్నారు. తరాలు మారిన మహిళల పట్ల హింస తగ్గడం లేదని, సమసమాజ స్థాపనకు మహిళా అభివృద్ధి, మహిళా సాధికారిత, మహిళను గౌరవంగా చూసే సమాజం అవసరమని అన్నారు. హేతువాదం, ప్రగతిశీల భావాలు సమాజంలో పెరిగినప్పుడే కులనిర్మూలన సాధ్యమవుతుందని అలాంటి సమసమాజం కోసం, మహిళా సమానత్వం కోసం కృషి చేస్తున్న సంఘాల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ అభినందన సభ నిర్వహణ నాయకులు వహీద్, తుమ్మ భాస్కర్, మాధవ కృష్ణారెడ్డి, ఆదాం రాజు, గుత్తా జ్యోత్స్న, భరత్ భూషణ్, రమేష్, బైరి నరేష్ లు మాట్లాడుతూ జస్టిస్ రాధారాణి ఇదు అంచెలుగా తన జీవితంలో రాణించారని గృహిణిగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా, సెషన్స్ జడ్జిగా, హై కోర్టు జడ్జిగా తన ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేశారని రానున్న రోజుల్లో సామాజిక చైతన్యం కోసం తన వంతు కృషికి సిద్ధంగా ఉండడం గొప్ప విషయమని అన్నారు. భారత రాజ్యాంగం దేశంలో ఉనికిలోకి వచ్చినా నాటి నుండి నేటి వరకు అది ఇంటలెక్చువల్ సమాజంలోకి మాత్రమే వెళ్ళిందని, రాజ్యాంగం జన బాహుళ్యం లోకి వెళ్ళనంత కాలం ప్రజాస్వామ్య వ్యవస్థలో సమసమాజం ఏర్పడదని అన్నారు. మెజార్టీ న్యాయవాదులకు కూడా రాజ్యాంగం గురించిన ప్రాధాన్యత, అవగాహన లేదని, భారత రాజ్యాంగ పీఠికను ప్రతి గ్రామానికి, భారత రాజ్యాంగ విశిష్టతను ప్రతి ఇంటికి తీసుకెళ్ళే బాధ్యతను ఐ ఎల్ పి ఎ తీసుకుందని అన్నారు. నల్ల కోటు ద్వారా నీలి విప్లవం కోసం న్యాయవాదులతో ఐ ఎల్ పి ఎ దేశవ్యాప్త ఉద్యమం చేస్తుందని అన్నారు. ఏ సమాజ ప్రగతినైన ఆ సమాజములో మహిళల ప్రగతిని బట్టి కొలవాలని అంబేద్కర్ ఆనాడే అన్నారని, ఎన్నో ఒడిదుడుకులను, ఎన్నో అడ్డంకులను, ఎన్నో అవరోధాలలను ఎదురించి అభివృద్ధి కావడం గొప్ప విషయమని, మగాధిపత్య మనువాద రాజ్యంలో ఎన్నో సవాళ్లను ఎదురించి జస్టిస్ ధారాణి నిలబడడం చాలా గొప్ప విషయమని అన్నారు. జీవితం మొత్తంలో వెంట్రుక వాసి మందం కూడా తొనకకుండ సమయం దొరికినప్పుడల్లా సమాజ చైతన్యం కోసం తన వంతు కృషి చేసిన జస్టిస్ రాధారాణి భవిషత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. జస్టిస్ రాధారాణి, గాంధీల జీవితం జ్యోతిబా పూలే, సావిత్రి బాయి పూలే జీవితానికి అద్దం పడుతుందని, సావిత్రిబాయి పూలే కు పూలే విద్య నేర్పించినట్లు గాంధీ రాధారాణిని జడ్జిని చేశారని కొనియాడారు. అంబేద్కర్ ఆలోచన విధానాన్ని కొనసాగిస్తున్న గాంధీ - రాధారాణి లకు అభినందనలు తెలిపారు. వీరి జంట సమాజానికి మరింత సేవ చేయాలని విజ్ఞప్తి చేశారు. జస్టిస్ రాధారాణి ఎదిగిన తీరు సమాజానికి స్ఫూర్తిగా నిలవాలనీ, భవిషత్ సమాజానికి దిక్సూచిగా నిలుస్తుందని, మరో మార్గ నిర్దేశనంగా నిలవాలని అన్నారు. కత్తితో సాధ్యం కానీ దాన్ని కలంతో సాధ్యం అవుతుందని నిరూపించిన జస్టిస్ రాధారాణి జీవితం ప్రత్యేక కొవ్వొత్తులు, కాగడాలు గుర్తు చేస్తుందని అన్నారు. ఎన్నో గుణ పాఠాలుగా నడిచిన తన జీవితం భవిషత్ సమాజాన్నీ తీర్చి తిద్దుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. శాంత స్వభావి, నిగర్వి, హేతువాది, నిజాయితీకి మారుపేరుగా నిలిచిన రాధారాణి కుటుంబం, వృతి, ప్రవృత్తి లను సమతూకంగా చేసుకొని ఎదిగినారని అన్నారు. పెళ్ళి అయిన తర్వాత విద్యాభ్యాసాన్ని కొనసాగించి హై కోర్టు జడ్జి వరకు వెళ్లడం గొప్ప విషయమని, తండ్రి ఆశయాలను కొనసాగించడంలో బాగంగా కులనిర్మూలన కోసం, సామాజిక రుగ్మతలను రూపుమాపే ప్రయాణంలో నిక్కర్షగా ముందుకు సాగారని అన్నారు. తన వృత్తిలో ఎన్నో కుటుంబాలను, బార్య భర్తలను కలిపిన చరిత్ర ఉందని, భర్తకు కాన్సర్ ను కూడా ధైర్యంతో ఎదుర్కొని నయం చేసుకున్న ధీశాలని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శాంసన్, సాయిని నరేందర్, లక్ష్మీదేవి, పూస మల్లేష్, వెన్నపూజ పరుషరాజు, సురేష్, పొడిచేటి శ్రీనివాస్, హస్న ఖాన్, బి బి షా, కేరీత్, ప్రవలిక, ఎస్తేర్, గంగాధర్, చంద్ర శేఖర్, గాంగేయుడు, గణేష్, జూకూరి మహేష్, వెంకటేష్ ప్రసాద్, వెంకటస్వామి, సైఫ్ఉల్లా, నవ్య, వివిధ సంఘాల నమ్మి స్వరాజ్య లక్ష్మీ, నాయకులు డాక్టర్ బాబు, నాస్తిక్ రాకేష్, అచ్యుత్, స్నేహ, ఏటిగడ్డ అరుణ, హనుమంతరావు, జ్యోతి, పద్మ, మహ్మద్అలీ తదితరులు పాల్గొనగా కృష్ణ చంద్ వందన సమర్పణ చేసారు.

# సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్టా

## పాల్గొన్న టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రెడ్డి

**తొలి సమయం తొర్రూరు జూలై 7**
తొర్రురు మండలంలోని పెద్దామంగ్య తండాలో ఘనంగా నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ మరియు మెరిమాయడి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రెండు విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గిరిజనుల సంప్రదాయ విశ్వాసాలకు తగినంత గౌరవం ఇచ్చారు..ఈ సందర్భంగా ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. సేవాలాల్ మహరాజ్ గారు గిరిజన సమాజానికి దారిదీపులాంటివారు. ఆయన చూపిన మార్గంలో మన యువత ముందుకు సాగాలి. అలాగే మెరిమాయడి అమ్మవారు ప్రజలకు ఆశ్రయం కలిగించే ఆదిదైవంగా నిలుస్తున్నారు. ఈ విగ్రహాల ప్రతిష్టాపనతో తండా ప్రాంత ప్రజల ఆధ్యాత్మిక అభివృద్ధికి ఇది గొప్ప మైలురాయిగా నిలుస్తుంది అని పేర్కొన్నారు..వారి వెంట స్థానిక గిరిజన పెద్దలు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్కృతిక కార్యక్రమాలు, గిరిజన కళల



ప్రదర్శనలు కూడా నిర్వహించబడ్డాయి. ఈ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం తండా ప్రజలంతా ఒక్కటై నిర్వహించిన ఉత్సాహపూరిత వేడుకగా నిలిచింది..

# పాలకుర్తి కేంద్రంలో పెద్దవంగర మండలం ఎంపీటీసీ క్లస్టర్ కమిటీ

## ముఖ్య అతిథిగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రెడ్డి



**తొలి సమయం పాలకుర్తి జూలై 7**
గ్రామ కోఆర్డినేటర్ కమిటీ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ మరియు పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి హాజరయ్యారు..ఈ సందర్భంగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ బలపడాలంటే గ్రామ స్థాయిలో పని చేసే కార్యకర్తల నిబద్ధత అత్యంత కీలకం. ఎంపీటీసీలు, గ్రామ కోఆర్డినేటర్లు ప్రజల సమస్యలను అర్థం చేసుకొని, పార్టీ పట్ల విశ్వాసం పెంపొందించే విధంగా కృషి చేయాలి" అని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.. ఈ సమావేశంలో మండలాల వారీగా కమిటీల పనితీరు, గ్రామస్థాయిలో పార్టీ కార్యాచరణ, సోషల్ మీడియా లో పార్టీ అభిప్రాయాలను విస్తృతంగా ప్రచారం చేయడం, మహిళలు, యువతను పార్టీలో చేర్చడంపై ప్రత్యేకంగా చర్చించారు..కార్యకర్తలు ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పార్టీ వేదికగా తీసుకెళ్లే విధంగా తమ బాధ్యతలను నిర్వర్తించాలని ఝాన్సి రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ పునఃసంఘటన, పటిష్ఠత దిశగా ఈ సమావేశం ఓ కీలక దశగా నిలిచింది..సమావేశంలో పెద్దవంగర మండల ఎంపీటీసీల కోఆర్డినెటర్లు, గ్రామ కోఆర్డినేటర్లు, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు..

# టేకులపల్లి సబ్ యార్డ్ నందు నూతన నిర్మాణల కోరకు ఎ .ఎం.సి. చైర్మెన్,డిప్యూటి ఇంజనీర్ గార్ల స్థల పరిశీలన

## ఎమ్మెల్యే కోరం ఆదేశానుసారం రైతుల సౌకర్యర్ధం నూతన నిర్మాణం.



**తొలి సమయం, ఇల్లందు.జూలై, 07.**
టేకులపల్లి మండలం సబ్ మార్కెట్ యార్డ్ నందు ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య ఆదేశాను సారం రైతుల సౌకర్యార్ధంనూతనంగా నిర్మించ బోయే ఆఫీస్ బిల్డింగ్,టాయిలెట్స్,సిసి మొదలగు అభివృద్ధి పనుల నిమిత్తం ఖమ్మం మార్కెటింగ్ డిప్యూటి ఇంజనిర్ యల్లేష్ తో కలిసి యార్డ్ స్థలాన్ని సందర్శించిన ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు వారి వెంట మార్కెట్ కమిటి డైరెక్టర్ జారే సమ్మక్క,మార్కెట్ కార్యదర్శి వి సుచిత్ర,మార్కెట్ గ్రేడ్ 03 కార్యదర్శి ఈ నరేష్ కుమార్,మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు

# ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య సహకారం తో 4 కోట్ల రూపాయల తో బుగ్గ వాగు ప్రక్షాళనకు ముందడుగు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



**తొలి సమయం, ఇల్లందు.జులై, 07.**
బిచేతల్లో అభివృద్ధి చూపిస్తున్న ప్రజల ప్రభుత్వంఇల్లందు పట్టణంలోని ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న బుగ్గ వాగు ప్రక్షాళన వేగంగా నడుస్తున్నవిషయంవిదితమే.. అభివృద్ధికి అసలైన అర్థం చెప్పినట్లుగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యను ప్రాధాన్యంగా తీసుకొని ముందడుగు వేసింది. పట్టణాన్ని నీటి ముంపు, దుర్వాసన, మలినాల నుంచి విముక్తి కలిగించే దిశగా బుగ్గ వాగు శుద్ధి కార్యక్రమం ప్రారంభమవడం గర్వకారణం. వర్షాలు ప్రారంభం అయిన సందర్భంగా దిగువ ప్రాంతాలు జలమయం కాకుండా చూడాలని అధికారులకు గౌరవ శాసనసభ్యులు ఆదేశించిన సందర్భంగా రిటైనింగ్ గోడ కోసం తీసిన మట్టిని తొలగించే కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర రావు . ముఖ్యంగా ఈ ప్రక్షాళన ప్రాజెక్టుకు నిధులు కేటాయించి, పట్టణ అభివృద్ధికి చొరవ చూపిన స్థానిక శాసనసభ్యులు కోరం కనకయ్య కి పట్టణ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.పెరిగిన వర్షపాతాన్ని దృష్టిలో పెట్టుకొని, బుగ్గ వాగు ప్రవాహాన్ని నిరాటంకంగా జరగగలిగే విధంగా శుభ్రపరిచే ఈ చర్య, పట్టణ ఆరోగ్య భద్రతకు, పర్యావరణ పరిరక్షణకు ఒక గొప్ప ప్రారంభంగా నిలుస్తోంది.పలువురు వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఇలా పేర్కొన్నారుఈ వాగు శుభ్రత వల్ల మాకే కాదు, ముమ్ముందు తరాల ఆరోగ్యానికి బంగారబాట అవుతుంది. వర్షాకాలంలో ముంపు సమస్యకు ఇది మంచి పరిష్కార మార్గం అవుతుందన్నారు.

# ఐఎఫ్టియు ఇల్లందు ఏరియా నూతన కమిటీ ఎన్నిక



**తొలి సమయం, ఇల్లందు.జూలై, 07.**
ది 6.7.2025న ఇల్లందు ఐఎఫ్టియు కార్యాలయంలో నిర్వహించిన ఐఎఫ్టియు ఇల్లందు ఏరియా కమిటీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.ఇల్లందు ఏరియా కమిటీ అధ్యక్షులుగా రావూరి ఉపేందర్ రావు, ఉపాధ్యక్షులుగా కొప్పుల శ్రీనువాస్,టి.యు.యం. చారి,ప్రధానకార్యదర్శిగా డి.మోహన్ రావు,సహాయ కార్యదర్శులుగా నరాటి వెంకటేశ్వర్లు,కొండపల్లి శ్రీనివాస్,కోశాధికారిగా తొగర సామెల్ తో పాటు మరో 18మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సమావేశంలో ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండి.రాసుద్దిన్ పాల్గొని మాట్లాడారు.

# పోడు జీవుల గోడు...



అటవీభూముల విషయంలో కాంగ్రెస్ సర్కారు రెండు నాల్కల ధోరణి విస్మయం కలిగిస్తున్నది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని అటవీ ప్రాంతాన్ని చెరబట్టబోయి భంగపడిన సంగతి తెలిసిందే. అదే సర్కారు గిరిజన ప్రాంతాల్లోని భూములను అటవీ భూములంటూ నానా హంగామా చేస్తున్నది. అడవిబిడ్డలను కడగండ్లపాలు చేస్తున్నది. ఈ ప్రభుత్వ హయాంలో జరిగిన్న ఘోర దురాగతాలు ఇన్నీఅన్నీ కావు. విద్యార్థులు, బుద్ధిజీవులు కలిసిపోరాడితే గానీ కేంద్ర వర్సిటీ భూములను కాపాడుకోవడం సాధ్యపడలేదు. కానీ, అమాయక గిరిజనుల విషయం అలా కాదు. కొండల్లో, కోనల్లో జీవనం సాగించే అడవి బిడ్డలు పోడు భూములను కాపాడుకునేందుకు నానా అగచాట్లు అనుభవించాల్సి వస్తున్నది. పోలీసుల బూట్ల కింద తండాలు, గూడేలు నలిగిపోతున్నాయి. ప్రతిఘటిస్తే దయాదాక్షిణ్యాలు చూపకుండా, ఆడామగా అనే తేడా లేకుండా నరకం చూపిస్తున్నారు. నిన్నామొన్నటి లగచర్ల నుంచి రంగంపేట, కోసగుంపు వరకు ఇదే తతంగం. 'ప్రాణాలైనా వదులుకుంటం కానీ భూములను వదులుకోబోమ'ని గిరిజనులు అంటే సర్కారు పోలీసు లాఠీని ప్రయోగించి దమనకాండకు దిగుతున్నది. వారు మన పౌరులు, మనం కాపాడాల్సిన పౌరులు అనే స్పృహ లేకుండా తరిమితరిమి కొడుతున్నది. మహిళలపై హింస ప్రయోగించడం సర్కారు కర్కశత్వానికి పరాకాష్ఠ. ఇది ఏ తరహా ప్రజాపాలన? మొన్నటికిమొన్న రాజన్న సిరిసిల్లా జిల్లాలోని రంగంపల్లిలో పోడు భూములపైకి సర్కారు దండెత్తింది. ఎవుసమే జీవనాధారంగా బతికే రైతన్నల నోటికాడి ముద్ద ఎత్తగొట్టేందుకు సమకట్టింది. ఇంకా పట్టాలివ్వని పోడు భూములను అటవీ భూములంటూ వితండవాదం ముందుకుతెచ్చింది. ప్లాంటేషన్ పేరుతో లాగేసుకునేందుకు సర్కారు ఎత్తులు వేసింది. ఊరు ఊరంతా ఒక్కటై ఎదురుతిరగడంతో తోకముడిచింది. ఇక భద్రాద్రి జిల్లా కోసగుంపులో జరిగిన దారుణాలు లగచర్ల దురాగతాలను మరిపించేలా ఉన్నాయి. శత్రు దేశంపైకి శతఘ్నులు తోలినట్టుగా అక్కడి భూములపైకి సర్కారు జేసీబీలతో దండెత్తింది. ఇదేమిటని ప్రశ్నించిన గిరిజన మహిళలతో ఖాకీలు వ్యవహరించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉంది. ఎప్పటినుంచో సాగు చేసుకుంటున్న భూముల్లోకి ఎందుకు వచ్చారని ప్రశ్నిస్తే నాటిన విత్తనాలు తవ్విపోస్తామంటూ రెచ్చిపోయారు. నిస్సహాయ మహిళలపై కీచకపర్వం సాగించడం పరమ దుర్మార్గం. 18 నెలల పాలనలో ఆదివాసీ గూడేలపై 22 దాడులు జరగడం దారుణం. ఇదేనా కాంగ్రెస్ తెస్తానన్న మార్పు? నిజమే. ఇదివరకటి బీఆర్ఎస్ పాలన ఎక్కడ? ఇప్పటి కాంగ్రెస్ పాలన ఎక్కడ? ఎంత తేడా. ఎక్కడి నుంచి ఎక్కడకు పడిపోయామని ప్రజలు వాపోతున్నారు. సుదీర్ఘకాలంగా తండాలు, గూడేలు కోరుకున్న స్వయంపాలన అవకాశాలు కల్పిస్తూ వాటిని గ్రామ పంచాయతీలుగా అభివృద్ధి చేసింది కేసీఆర్ ప్రభుత్వం. 'మావ నాటే మావ రాజ్' నినాదాన్ని నిజం చేసింది. జీవనాధారమైన పోడు భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తూ గిరిపుత్రులకు పట్టాలు పంపిణీ చేసి రికార్డు సృష్టించింది. 'మావ జమీన్.. మావ పట్టా' నినాదాన్ని సాకారం చేసి దేశానికే ఆదర్శంగా నిలిచింది. దేశవ్యాప్తంగా అటవీ హక్కుల చట్టం అమల్లోకి వచ్చాక ఏకకాలంలో నాలుగు లక్షల పైచిలుకు ఎకరాలకు పట్టాలు పంపిణీ చేయడం ఓ చరిత్ర. ప్రస్తుత కాంగ్రెస్ మంత్రి సీతక్క తల్లిదండ్రులు కూడా లబ్ధిదారుల్లో ఉండటం విశేషం. గిరిపుత్రులు ప్రశాంతంగా వ్యవసాయం చేసుకుని హాయిగా జీవిస్తారనే చల్లని తలంపుతో ఈ మార్పులు ప్రవేశపెట్టింది బీఆర్ఎస్ సర్కారు. అందుకు భిన్నంగా కాంగ్రెస్ సర్కారు గిరిజనులను వారికి ప్రాణసమానమైన భూమికి దూరం చేసేందుకు వికృత మార్గాలు అనుసరించడం దుర్మార్గం.

# మద్దతు ధరల మర్మం !



కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన సాగుచట్టాలను రద్దు చేసినా..రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు. వ్యవసాయాన్ని ఆదాయం వచ్చేలా తీర్చిదిద్దుతామన్న హామీ మేరకు నిర్ణయాలు తీసుకోవడం లేదు. సాగుచట్టాలను రద్దు చేయాలని ఉద్యమిస్తే తప్ప ..ఆ ఉద్యమ ఉధృతికి తాళలేక చివరికి వాటిని ఉపసంహరించుకొంటున్నట్టు మోడీ ప్రకటించారు. ప్రధాని మోడీ దేశానికి క్షమాపణలు చెప్పుకొన్నారు. కానీ ఏడాదిపాటు రైతులు ఉద్యమించడం వల్ల ఎందరో బలయ్యారు. ఈనిపై కించిత్తు కూడా విచారం వ్యక్తం కాలేదు. ఈ సందర్భంగా మొత్తం 23 పంటలకు మద్దతు ధరల హామీ ఇస్తూ చట్టాన్ని చేయాలన్న అన్నదాతల అసలు డిమాండ్ ఇంత వరకు నెరవేరలేదు. దీనిపై చర్చలు జరిపి చట్టాన్ని తెస్తామని ఇచ్చిన హామీని ప్రధాని మోడీ ప్రభుత్వం మరిచిపోయింది. ఇతర అన్ని సరకులకు, సామగ్రికి లాభసాటి ధరలను నిర్ణయించి అమ్ముకొనే స్వేచ్ఛ వాటి ఉత్పత్తిదారులకు వుండగా, ఒక్క వ్యవసాయ ఉత్పత్తుల విషయంలోనే రైతుకు అటువంటి స్వేచ్ఛ లేకపోడం దారుణం.అన్నదాతలు చేసుకున్న పాపామో ఏమో కానీ మద్దతు ధరల కోసం ఏటా ఎదురుచూపులే. అన్యాయంగా రైతుల శ్రమ మీద దళారులు బాగు పడుతున్నారు. పంటలు పండించిన రైతులు మాత్రం రోజురోజుకీ కుంగిపోతున్నారు. ఈ దుస్థితి తొలగా లంటే స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసిన విధంగా అసలు ఖర్చుకి రైతు ఇంటిల్లిపాది చేసే శ్రమ విలువ ను కూడా చేర్చి ఆ మొత్తానికి ఒకటిన్నర రెట్లు మద్దతు ధరగా నిర్ణయించవలసి వుంది.

రైతు కోసం ఏదైనా చేస్తామంటారు గాని, స్వామినాథన్ కమిషన్ సిఫారసు యధాతథంగా ఇంత వరకు అమలు చేయలేక పోతున్నారు. బహుళజాతి కంపెనీలకూ ఎర్రతివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. నిజానికి కంపెనీలకు మించిన ఆదాయాన్ని, ఉద్యోగ కల్పనను వ్యవసాయరంగమే కల్పిస్తోంది. వ్యవసాయానికి పెద్దపీట వేసివుంటే ఈ రంగం దేశ ఆర్థిక పురోగతిలో కీలకం అయ్యేది. అనేక కంపెనీలకు ఇస్తున్న రాయితీల మాదిరి వ్యవసాయా నికి కూడా రాయితీలు ఇచ్చి పంటల ఉత్పత్తిని సవాల్‌గా తీసుకోవాలి.. సేంద్రియ వ్యవసాయానికి చేయూతను ఇవ్వాలి. అలాగే దేశంలో ఉన్న వ్యవసాయభూముల్లో ఎక్కడెక్కడ ఏ పంట పండుతుందో తెలుసు కనుక అందుకు అనుగుణంగా పంటల విధానం తీసుకుని రావాలి. అయితే రైతులను ఓటు బ్యాంకుగా చూడడం అలవాటు చేసుకున్న పాలకులు వారిని దేశంలో ఆర్థికరంగంలో కీలకమైన వ్యక్తులుగా చూడడం లేదు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టి యువతను ప్రోత్సహించడం ద్వారా నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టవచ్చు. కానీ అలా జరగడం లేదు. సస్యవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన తరుణంలో వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. దేశీయంగా వ్యవసాయ పురోభివృద్ధికి పాటుపడడం లేదని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయం రంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిదని అంటున్నారు. అయితే అలాంటిదేమీ లేకపోగా కంటితుడుపు చర్యలతో కాలం నెట్టు కొస్తున్నారు. ఇటీవల చెరకు మద్దతు ధరలను పెంచారు. చెరకు ధరను రూ. 10 పెంచి క్వింటాలు రూ. 315కి చేర్చింది. యూరియా సబ్సిడీని కొనసాగించాలని నిర్ణయించింది. సేంద్రియ ఎరువుల ఉత్పత్తిని ప్రోత్సహించడానికి ప్రత్యేక పథకాన్ని అమలు చేయదలచింది. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయాలను తీసుకొన్నది. 2024 ఏప్రిల్‌లో వచ్చే చెరకు పంటకు ఈ కొత్త ధర వర్తిస్తుంది. వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో వుంచుకొని ఈ నిర్ణయాలు తీసుకొన్నట్టు బోధపడుతున్నది. చెరకు అత్యధికంగా పండించే రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో వుండగా, రెండో స్థానంలో మహారాష్ట్ర, మూడో స్థానంలో కర్ణాటక వున్నాయి. ఇక్కడ రైతులను మచ్చిక చేసుకునేందుకే ఈ పెంపు ప్రతిపాదన అన్నది వేరుగా చెప్ప నక్కర్లేదు. అయితే స్వాతంత్య వజ్రోత్సవాల బహుమతిగా 2022 23 ఆర్థిక సంవత్సరంలోనే దేశంలోని రైతుల అందరి ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని ప్రధాని మోడీ చేసిన వాగ్దానం మరచిపోయారు. సంస్థాగత రుణాలు అందుబాటులో లేక, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దయాదాక్షిణ్యాల మీద ఆధార పడుతున్నందున రైతులు సాగు మీద సంపాదిస్తున్న దానికి, తీర్చవలసిన అప్పుకి లంకె కుదరడం లేదు. వ్యవసాయ ఆదాయానికి మించి అప్పులు పేరుకుపోడంతో వున్న ఎకరా, అర ఎకరా భూమిని అమ్ముకొని కౌలు రైతులుగానో, వ్యవసాయ కార్మికులుగానో మారిపోతున్న రైతులు దేశంలో ఎంతో మంది వున్నారు. ఆడపిల్ల పెళ్ళి చేయలేక ఉరి తాడును ఆశ్రయిస్తున్న వారున్నారు. రైతులకు ఇంత చేశాం, అంత చేశాం అని చెప్పుకొనే కేంద్ర ప్రభుత్వం 2020 ఆగస్టు నుంచి 2021 డిసెంబర్ వరకు దాదాపు ఏడాదిన్నర కాలం ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన చరిత్రాత్మకమైన రైతు ఉద్యమం వల్ల రైతులకు గట్టిగా చేసిందేమీ లేదు. మూడు నల్ల చట్టాలను వారి ముందు ఉరి తాళ్ళ మాదిరిగా వేలాడ దీసి రెచ్చగొట్టి ఉద్యమంలోకి లాగిన తీరును దేశం ఇంకా మరచిపోలేదు. ఈ క్రమంలో మద్దతు ధరలు మరింతగా పెరగాలి. వ్యయసాయానికి ప్రధాన్యం ఇవ్వాలి. వారికి కావాలసిన వసతులను సమకూర్చి దేశంలో దీనిని అగ్రగామిగా నిలబెట్టాలి.


# కార్పొరేట్ కులతత్వం




జిలుగువెలుగుల కార్పొరేట్ ప్రపంచం అడుగున కులతత్వం కుళ్లు కంపు కొడుతున్నదా? మడతలు నలగని సూటూబూటూ కింద సంకుచిత కులాధిపత్యం పాకుతున్నదా? లేక వేళ్లూనుకొని కుక్కమూతి పిందెలు వేస్తున్నదా? ఇండిగో సంస్థలో ఓ ఉద్యోగికి ఎదురైన చేదు అనుభవం జాతిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇంకా వెనుకబాటుతనం పూర్తిగా మాసిపోని పల్లెటూళ్లలోనో, ఆధిపత్యవాదం రాజ్యమేలే గొప్పగొప్ప విద్యాసంస్థల్లోనో కులతత్వం ఉందంటే నిజమే అనుకోవచ్చు. అందుకు సంబంధించిన వార్తలు మనం తరచుగా వింటూనే ఉంటాం. దేశంలోని అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో చాలా చోట్ల దళిత పెండ్లిళ్లలో వరుడు గుర్రమెక్కి ఊరేగడం ప్రాణాంతకమే. పేరుమోసిన వర్సిటీల్లో దళిత బిడ్డలు వేధింపులు భరించలేక ఉసురు తీసుకునే ఉదంతాలు మన దృష్టికి ఇంకా వస్తూనే ఉన్నాయి. ఇది నవభారతం మోస్తున్న నిన్నటి శాపం, రేపటి పాపం. ఒక కార్పొరేట్ సంస్థలో 'నువ్వు అధముడివి, విమానాలు నడపడంతో నీకేం పని.. పోయి చెప్పులు కుట్టుకో' అని తోటి ఉద్యోగులు ఓ దళిత బహుజన పైలట్‌ను దారుణంగా అవమానించడం ఏమిటి? చెప్పులు కుట్టే చేతులు విమానాలు నడపొద్దని రాజ్యాంగం ఏమైనా చెప్తున్నదా? భారతదేశానికి కులవివక్ష కొత్త కాదు. కానీ, కార్పొరేట్ తెరమీద అది మరీ ప్రస్ఫుటంగా ప్రత్యక్షం కావడం ఆలోచింపజేస్తున్నది. ఉద్యోగి తన బాస్‌ల మీద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దాఖలైంది. విచారణలో ఏం తేలుతుందనేది వేరే సంగతి. కానీ, ఈ ఘటనతో కార్పొరేట్ ప్రపంచంలో కులతత్వంపైకి అందరి దృష్టి మళ్లింది. ఆర్థిక సరళీకరణల భుజాలపై ఊరేగుతూ ప్రపంచీకరణ దూసుకొస్తున్న రోజుల్లో ప్రపంచం ఓ కుగ్రామంలా మారుతున్నదనే మాట తరచుగా వినిపించేది. అడ్డుగోడలు తొలగిపోతున్నాయన్న భావనలు పురివిప్పుకొన్నాయి. భారత్ అంతకంతకూ విశ్వ ఆర్థికవ్యవస్థతో పెనవేసుకుపోతున్న నేపథ్యంలో మన నేతలు తరచుగా వసుధైవ కుటుంబం అనే భావనను పదేపదే ఉల్లేఖించడం పరిపాటి అయిపోయింది. కానీ, ఆ ఉదాత్త భావనను సాధించడానికి భారత్ ఇంకా చాలాచాలా దూరంలో ఉన్నదని ఇటీవల ఈ గడ్డ మీద జరుగుతున్న సంకుచిత కుల వైషమ్యాలు సూచిస్తున్నాయి. ప్రైవేటీకరణ జోరులో విస్తరించిన కార్పొరేట్ ప్రపంచంలో కులాతీత, ప్రజ్ఞ ఆధారిత ప్రోత్సాహమే ఉందనేది సాధారణ అవగాహన. కానీ, ఇండిగో ఉదంతం ఇదంతా భ్రమేనని అంటున్నది. కులవ్యవస్థ అనేది శ్రమ విభజన మాత్రమే కాదని, అది శ్రామికుల విభజన అని అంబేద్కర్ చేసిన సూత్రీకరణ ఇక్కడ గుర్తుకువస్తున్నది. కార్పొరేట్ ఆధిపత్య వ్యవస్థ అన్ని సామాజిక వర్గాలకు సమప్రాధాన్యత ఇచ్చే వ్యవస్థగా రూపొందేందుకు ప్రయత్నిస్తున్న మాట నిజమే. కానీ, ఆ దిశగా నిచ్చెనలు అందుకునేలోగా కులతత్వం పాములు కిందకు ఈడ్చేయకుండా చూసుకోవాలి.

# జలమే మానవాళికి జీవనాధారం

**బెంగళూరు:** బెంగళూరులో నీటి సమస్య తీవ్రం కావడంతో మనమెంతగా దూరదృష్టి లేకుండా మనుగడ సాగిస్తున్నామో అర్థం చేసుకోవచ్చు. నీటి వనరులను ధ్వసం చేయడం, చెరువుల, కాలువను ధ్వసం చేయడం వల్ల తీరని నీటి సమస్యను ఎదుర్కొంటున్నాం. తాగడానికి నానా తంటాలు పడుతున్నాం.



కర్నాటక పరిస్థితులు మనకు ఓ హెచ్చరిక కావాలి. నీరు లేనిదే సమస్త జీవ కోటికి మనుగడ లేదు. అసలు జీవ పరిణామం ప్రారంభమైందే సముద్ర గర్భంలో అనే విషయం తెలిసిందే. ఒకప్పుడు పుష్కలంగా లభించే మంచి నీటిని అభివృద్ధి పేరిట కలుషితం చేస్తున్నాం. అవసరానికి మించి వాడుతూ వాటిని వృథా చేస్తున్నాం. దీంతో సమీప భవిష్యత్తులో నీటి కోసం యుద్దాలు జరిగే రోజులు కూడా రానున్నాయనడంలో ఆశ్చర్యమేమీ లేదంటే అతిశయోక్తి కాదేమో. ఈ పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతోనే ఐక్యారాజ్య సమితి 'ప్రపంచ జల దినోత్సవం' అంటే వరల్డ్ వాటర్ డే ను నిర్వహిస్తున్నది. ప్రతియేటా మార్చి 22న దీనిని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. వరల్డ్ వాటర్ డే.. పది ఆసక్తికర విషయాలు గగమనించాలి. ప్రపంచంలో నేడు ప్రతి ముగ్గురిలో ఒకరికి శుద్ధమైన తాగునీరు దొరకడం లేదు. 2050 నాటికి భూమి మీద నివసిస్తున్న వారిలో సుమారు 5.7 బిలియన్ల అంటే 500 కోట్ల మంది సంవత్సరానికి ఒక నెల పాటు నీటి కొరత ఎదుర్కొన నున్నారని అంచనా. మంచి నీటి సరఫరా, పారిశుధ్యం సక్రమంగా ఉంటే ప్రతి యేటా 3,60,000 వేల మంది శిశువుల ప్రాణాలను కాపాడుకోవచ్చు. గ్లోబల్ వార్మింగ్‌ను పూర్వస్థాయి కంటే 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేస్తే వాతావరణ ప్రేరిత నీటి ఒత్తిడిని 50 శాతం వరకు తగ్గించవచ్చు. గత దశాబ్దంలో 90 శాతానికి పైగా విపత్తులు తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగానే తలెత్తాయి. 2040 నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఇంధన డిమాండ్ 25 శాతానికి, నీటి డిమాండ్ 50 శాతానికి పైగా పెరగనుందని అంచనా. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా అందరికీ నీరు, పారిశుధ్యం కల్పించాలని ఐరాస లక్ష్యంగా పెట్టుకుంది. 2018-2028 దశాబ్దాన్ని 'వాటర్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్'గా ఐరాస జనరల్ అసెంబ్లీ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాఠశాలలో సగానికంటే ఎక్కువ స్కూళ్లలో విద్యార్థులకు హ్యాండ్ వాషింగ్ సౌకర్యాలు లేవు. కనీసం చేతులు కడుక్కోవడానికి నీరు, సబ్బు కూడా అందుబాటులో లేని స్కూళ్లు కూడా చాలా ఉన్నాయి.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101